కనిథాక

# వ్యక్తావ్యక్తం

సులోచన

బారాటి జడను ముందుకు లాగి, వెంట్రుకల కొసల్ని అల్లుతో, అద్దంలో ముఖం చూసుకొంటూ, ప్రతిబింబంలో అసంతృప్తి ఆవరించిన ముఖం ప్రస్ఫుటమవుతూంటే, అనుకొంటూంది అన్నపూర్ణ—

ఈ అలంకరణ, పైపై మెరుగులు, సబ్బు స్నోలతో ద్విగుణీకృతమైన అందాన్ని, చూడొచ్చిన పెళ్ళికొడుక్కు చూపించి, నచ్చేట్టు చేసి ఇక ఈమెను తప్ప ఈలోకంలో మరెవ్వర్నీ చేసుకోను అనేట్టు చేయాలి కాబోలు! ఇవతల చేసుకొనేవాని కిష్టంలేకపోయినా ఇవతలవాళ్ళ యిష్టాయిష్టాలు, ప్రియాప్రియాలు ఆలోచించరు, అవి అవసరంగా కనపడదు! పదహారేళ్ళు గారాబంగా పెంచాము కదా, ఏ లోటూ లేకండా చూశాము కదా, ఇక మిగిలిన జీవితాన్ని కూడా హాయిగా గడపటానికి పిల్లకు నచ్చిన భర్తనికట్టి. మనం యివతలకు తొలగి వాళ్ళ ఆనందమే మన ఆనందం అనుకొని జీవించవచ్చుగా? అలాఎందుకని చేయరు తలిదండ్రులు? చావబోతూ కాటికి కాళ్ళుచాస్తూ, అంతా ప్రోగుజేద్దామనే చూపదప్ప, ఫలానా అసమర్థుడికి డబ్బుకు జాఢి, పిల్ల నివ్వబోతున్నాము, అదెవరికి లోటు-అందువల్ల ఎవరి జీవితం బాధామయం అవుతుంది అనే ఆలోచన వున్నదా? యుక్తవయస్సుదాకా గొప్పగా, సిల్కుగుడ్డల్లో బంగారపు నగల్లో, అనువైన తిండిలో, భవ్యమైన భవనాల్లో, హోదాల్లో, పెంచాము-నలుగురుచూతా 'గొప్ప' అనిపించుకొన్నాము. అంతటితో మాపని అయిపోయిందని తృప్తిపడతారు గాని; ఏదో పిల్లప్రేమించిన పిల్లవాడికి, చిన్నప్పట్నుంచీ అనురాగంగా కలిసివున్న పిల్లవాడికి, పొలం ఆట్టే లేకపోయినా యిచ్చాము, ఎటు తిరిగీ వాళ్ళు ఆనందంగా వుండటమే మేము కోరింది. పెద్దవారని ఆశపడి యిచ్చి గోతిలోపడి గోలపెడతే వుపయోగం ఏముందీ అని తృప్తి పడరేం ఈ తలిదండ్రులు? నాగేశ్వరరావుకు మటుకు ఏంలోటు? పదెకరాల నిక్షేపంలాంటి పొలంవుంటే, ఒక్కడే. తనకి ఇరవై ఎకరాలు, ఒక పెద్ద భవంతి- రెండు జీవితాలు ఆనందంగా జీవించటానికి ముప్పై ఎకరాల పొలం, భవంతి చాలదూ? వెళ్ళేప్పుడు అంతా కట్టుకుపోతారేమిటి. ఇది నాన్నతో అంటే- అమ్మో! ఏమన్నా అంటాడేమో? ఛీ- భయపడటమేమిటి! అందులో ఈ విషయంలో జీవితం మీద ఆధారపడ్డ ఈ విషయంలో. కాని, నాన్న ఏమన్నా...

'అమ్మాయి! ఎంతసేపే నీ శృంగారం- ఇక చాల్లే, లే-పెళ్ళికొడుకుని మురిపిద్దువుగాని లే'. తల్లిమాటలకు ఉలిక్కిపడి లేచింది అన్నపూర్ణ.

ఆ మాటలకు మామూలు పెళ్ళికూతురైతే 'పోదూ, నీవంతా-' అనో, 'ఉండవే అమ్మా! మరీనూ-' అనో అని వుండవలసింది. కాని అలాంటిదేమీ కూతురు నోటినుండి రాకపోగా, కనీసం ముఖంలోనన్నా సిగ్గు లేకపోడంచాత ఆశ్చర్యపోయింది తల్లి. గుడ్డలు మార్చుకోనేందుకు లేచి గదిలోకెళ్ళింది అన్నపూర్ణ.

అన్నపూర్ణ ప్రక్కింటి నాగేశ్వరరావును ప్రేమించినమాట ఉభయ తలిదండ్రులకూ, దాదాపు ఊరుఊరంతా తెలుసు. కాని ఆప్రేమమూలంగా వాళ్ళిద్దరికీ పెళ్ళవుతుందని మాత్రం రూఢిచేసుకోలేదు. అలా రూఢిచేసుకొని, తీరా ఆ రూఢి 'రూఢి' కాదని తెలిసి దుఃఖిస్తూన్నది ఒక్క అన్నపూర్ణే. ఇన్నిరోజులుగా ఆలోచించింది 'చిన్నప్పట్నుంచీ ఒక బళ్ళో చదివి, ఒకచోట ఆడుకొంటూ, పాడుకొంటూ, గిల్లుకొంటూ, రక్కుకొంటూ, వెక్కిరించుకొంటూ చేతులు కలుపుకుని తిరుగుతూండే, అంతరంగా ప్రేమించుకొనే, ఎవ్వరు లేనప్పుడు ఎర్రగన్నేరు చెట్టు చాటున సూర్యుడు ఎర్రగా అస్తమించేప్పుడు, తెల్లని వెన్నెల్లో సంపెంగచెట్లు సువా

సనలో చెట్టుప్రక్కన ఊరుమాటు మణిగినప్పుడు కాంతివంతమైన ముద్దులతో, వలపు లొలికే మాటలతో, కమ్మని కౌగిళ్ళతో, ప్రేమని వృద్ధి చేసుకొనే తనకి నాగేశ్వరరావుకూ నాన్న దీవించి తప్పకుండా పెళ్ళి చేస్తాడని, గర్వింపజేస్తాడని. కాని అవి ఆలోచనలుగానే వుండిపోయాయ్.

పెళ్ళి చూపులయిపోయినయ్. పెళ్ళికొడుకు తండ్రితో 'నాన్నా! ఈ సంబంధం కుదుర్చు, పిల్ల నాకు నచ్చింది' అని అనటం సరదాగా విన్నాడు అన్నపూర్ణ తండ్రి. పొంగిపోయి తక్షణం పదిరోజులుండేట్టు లగ్నం పెట్టించాడు.

అన్నపూర్ణ ఏం చేస్తుంది? అప్పుడసలు ఆ వాతావరణంలో వున్నవాళ్ళు ఏం చేయాలి? 'నాన్నా! నాకీ సంబంధం వద్దు, నాగేశ్వరరావును చేసుకొంటాను. అతనంటే నాకు భలే యిష్టం' అని అనాలని, అన్నం తిన్నాక మంచి నీళ్ళిచ్చేప్పుడు, మధ్యాహ్నం పుగాకు కాడ యిచ్చేప్పుడు, మరోసారి తీరిగ్గా కూచున్నప్పుడు ప్రయత్నించింది; కాని అవలేక పోయింది. భయం! ఈదేశంలోతండ్రులకు పెళ్లివిషయంలో భయపడే కూతుళ్లు ఛాలామంది వున్నారు. వాళ్ళకి లోన భయపడి, అనవసరంగా భయాన్ని కొని తెచ్చుకొని జీవితానికి సంబంధించిన గొప్ప సమస్యను పరిష్కరించలేకపోతున్నామే, యిష్టమొచ్చినవారిని వివాహమాడలేక పోతున్నామే, అనే దిగులు వుంటుంది! అంతవరకేగాని వాళ్లు తండ్రుల్ని తెగించి అడగరు. పెళ్ళికొడుకు నచ్చాడా అని తండ్రి అంటే మూతి విరుద్దామనీ, బావుండలేదనీ, ఆపైన తను చేసుకోతల్చుకొన్న వారి పేరు చెబుతామనీ అనుకొన్నది అన్నపూర్ణ. తండ్రి ఆమాట అడక్కుండానే లగ్నం కుదర్చటం అన్నపూర్ణకి మరీ బాధ కలిగించింది.

పిల్లకు నచ్చిందా, లేదా అని విచారించి-నచ్చిన సంబంధం చేసే ఆచారం కొంతమంది తలి దండ్రులకు వుండదు. కుటుంబం, ధనం, హోదా, గౌరవం, పొలం, పశువులు, స్థలం-ఆలోచిస్తారుగాని పిల్లవాడి యోగ్యత, అందం, నడవడి, లక్షణాలు ఆలోచించరు. పెళ్ళి చేసుకున్నాక, కొన్నాళ్ళు జీవితానుభవాన్ని జీర్ణించుకొన్నాక ఆమె తెల్సుకోగలగాలి భర్తయొక్క అవలక్షణాలు, అసత్య ప్రవర్తన, అవనీతి, కౌటిల్యం, కాఠిన్యం. అప్పుడామె మహాసాధ్వియై పతివ్రతల ప్రసిద్ధ రచనలు చదివి, జీర్ణించుకొని, భర్తని సక్రమ మార్గంలోకి పెట్టాలి; ఎన్నికష్టాలైనా పడి, తన్నులు, తిట్లు, గుద్దులు, భరించి. ఏం నీతి? ఏం అహింస? కాని, ఇది ఆలోచించాల్సిన అవసరంగా తలి దండ్రులకు తోచకపోడం అన్నపూర్ణ దురదృష్టం అనాలి.

చీకటి నునుపు ఆవరించిన సమయంలో, చల్లగాలికి మడత మంచంమీద, జామచెట్టు క్రింద పడుకొన్నాడు నాగేశ్వరరావు. అతనొచ్చాడని రెండు రోజుల క్రిందట తెల్సినా వచ్చి మాట్లాడేందుకు ఆమెకు బలం చాలటం లేదు. మనసు విడిచి ఎలా మాట్లాడేది? ఇంత చేసి, సిగ్గులేక - మనసు నొప్పించే పనిచేసి, తను బాధ పడుతూ ఎలా మాట్లాడేది? అని రెండు రోజులు ఆలోచించింది.

తప్పుచేస్తే పురుషుడి విషయంలో, అప్పుడామె భయం, సిగ్గు బాధ, అసహ్యాలని పొందటం సహజం. అంతేకాని తప్పును సరిదిద్దుకొనేందుకు కొన్ని అబద్దాలాడటం, ధీమా చూపటం, మొదలైనవి ఆచరించదు ఆచరించే స్త్రీలు లేకపోలేదు. ఆ రకానికి మాత్రం అన్నపూర్ణ చెందదు.

మంచం ప్రక్కగా, తల వెగ్గా, జామచెట్టు ఆకులు తలని కప్పుతుంటే నుంచుంది అన్నపూర్ణ ఏమైనా కానీ అని. ఆ వేళే పెళ్ళికూతుర్ని చేసినట్టున్నారు మెడనిండా నగలు, ఆ చీకటి నునుపులో తళతళ మెరుస్తున్నాయ్. సిల్కుచీర మెరుస్తుంది కాంతి లేకపోయినా,-కమ్మటి వాసన వేసి పెనక్కు తిరిగాడు నాగేశ్వరరావు. ఆమెను ఎన్నిసారుల్లు చూడలేదు గనుక కాని యిలా ఎన్నడూ వినయంగా. చాటుగా, సిగ్గుసమ్మిశ్రమైన భయంతో, ఎన్నడూ సంచరించని దానిలా, చూస్తే ఏమంటారో అనే దిగులుగా చూడలేదు. అయితే ఒకటనుకున్నాడు కొత్త పెళ్ళికూతురు గా మోసు, అంతమాత్రం బిడియం, సిగ్గు ఉండక్కర్లేదా?

'ఎందుకలా నిలుచున్నావు, కొత్తా? కోపమా?'

అన్నపూర్ణ ఏమనంటుంది? కొత్తా అంటే రోజూ తిరిగే స్థలాన్ని తెగించయితేమాత్రం కొత్తని ఎలా అనేది? కోపమా? ఎవరిమీద కోపం? అతనిమీద తనకేం కోపం? తనమీద తనకేం కోపం, తనమీద అతని కుండాలిగాని తనని పెళ్ళి చేసుకోకుండా పరాయివాణ్ని ఏమీ తెలియకండా పెళ్ళి చేసుకొంటున్నదని.

'సిగ్గా-ఓహో కొత్తపెళ్లి కూతురువుగాబోలు ఎంత ఇదైతేమాత్రం నీస్నేహితుడితో చెప్పక్కర్లేదు ఆమాత్రం!' అన్నాడు నాగేశ్వరరావు నవ్వుతూ.

ఇప్పుడర్థమైంది అన్నపూర్ణకి తనని అంత రంగా ఎగతాళి చేస్తున్నాడని, అసమర్థతని విమర్శిస్తున్నాడని. నిజమే. తను సమర్థించుకోగలుగుతుందా? పలకవలసిన అగత్యమేముంది? ఇదివరకంటే—'

ఎందుకు ఇంకా బాధపర్చటం నాగేశ్వరరావు? తను క్షమార్పణ చెప్పుకొంటే బాధపర్చకుండా వుంటాడా?

'నాగేశ్వరరావ్!' మిగిలింది మిగులుగానే వున్నది, చెప్పలేదు గనుక, క్షమాపణ చెప్పుకొనే తాహతు లేదు గనుక.

'ఏమిటి? బాధపడుతున్నావా? - ఎందుకు, పెళ్ళికొడుకు మంచివాడు కాదా? ఫరవాలేదు- అందంగా లేకపోయినా గుణాలు బాగుండి వుంటాయ్!'

'అదిగాదు! నీ కిష్టమేనా?'

'ఏమిటి? ఎందుకిష్టంకాకుండా పోవాలి! ఎవరో అమ్మాయి వచ్చి నేను ఫలానా అబ్బాయిని వివాహం ఆడుతున్నాను అంటే అయిష్టమని చెప్పే అవసరాన్ని ఎందుకు కలిగించుకోవాలి?'

అక్కడికి తను పరాయిదాన్ని. ఇన్నాళ్ళనుండీ పరాయిదానిగానే భావించి వ్యవహరించాడా? అయితే అంత ప్రేమ దేనికి? మమత దేనికి? సమయంలో నన్ను అవమాన పర్చటానికేనా? ఇష్టమైతే నేరుగా ఎందుకు చెప్పకపోవాలి? అంత డొంక విరుగుడు దేనికి?

మళ్లా అన్నాడు:

'మీ తలితండ్రులు ఒప్పుకోని,నీవు ఒప్పుకోని ఎవర్నో 'నీకు యిష్టమేనా? అని అడగమేమిటి?'

అసలు అతను ఆమాటలు అన్నది ఆమె చేసిన తప్పుకు కుమిలి, మళ్ళీ మనోవ్యాధితో చావాలని గాదుగాని మొత్తానికి బాధపడాలని, చేసిన తప్పు తెల్సుకోవాలని, పశ్చాత్తాపం పొందాలని.

'సూటిగా చెప్పరాదూ? ఆడొంక తిరుగుళ్ళు దేనికి?'

'ఎందుకు చెప్పాలి?'

'అనేనా ఇదంతా చెప్పింది.'

'అవును, కోరి తెచ్చుకున్నావు - మంచిదే. నంటాను'ఆమాటల్లో కసువు,కసుగు బాధ,అసూయ

తనా కోరి తెచ్చుకొంది? ఇంకా అంతా అనుమానమేనా? తనని బాధ పెట్టడమెందుకు? కర్తవ్యం చెప్పరాదా?-చేయనంటేగా?

'నాగేశ్వరరావు! ఆ పెళ్లి నేను యిష్టపడే చేసుకొంటున్నా ననుకొంటున్నావా? ఒట్టిది, శుద్ధ అబద్ధం-అంతా మోసం! గొప్ప ఆస్తి ముసుగులో జరిగే మోసం. నీవు సిద్ధపడు-లేచి వెళదాం నా కిష్టమే! ఈనగలు గుడ్డలు చేస్తయ్ కొన్ని వేల రూపాయలు. హాయిగా దివ్యంగా పెళ్ళి చేసుకువద్దాం! తరువాత సంగతి తరువాత. అప్పుడైనా ఒప్పుకోరా?'

తెగించింది తను! ఏమటి లేకపోతే? ఎన్నాళ్లు ముసుగులో గుద్దులాట! అనవసరంగా బాధపడటం దేనికి రెండు జీవితాలు? ఇంకా ఎందుకు సందేహిస్తాడు నాగేశ్వరరావు? ఈ త్యాగం చాలదా? అయితే ఇంకేం చేయాలి? ఎలా సంతోష పెట్టాలి?

'ఏం, సిద్ధపడవా?- ఎందుకని?'

'మరేంటనుకున్నావ్, తనను విడిచి,దుంఖంలో ముంచి మరిచి వెళుతుందనుకున్నావా నీ అన్నపూర్ణ! వట్టిది. ఆ రోజు - ఎక్కడా? అక్కడ సంపెంగ చెట్టుక్రింద నిన్ను ముద్దుపెట్టుకొంటో నిన్నుతప్ప వివాహం చేసుకోను-అని అనలేదూ; అది మరచి పోయాననుకొన్నావా? పిచ్చి తండ్రి చూడు కళ్లు ఎలా పీక్కుపోయాయో. దిగులు పడ్డావు కాబోలు! మరి నేనెంత దిగులుపడ్డాననుకొన్నావ్? రెండు రోజులు సరిగ్గా అన్నంకూడా తినలేదు, ఊఁ! ఇక నన్ను వదులు త్వరగా తయారు కావాలి; మరి బండి అందదు.'

పరుగెత్తింది, గదిలోకి. గుడ్డలు సర్దింది ఒక తోలుపెట్టెలోకి. ఆరు సిల్కుచీరలు. మూడు

ఖద్దరు సిల్కు చీరెలు, రెండు మామూలు సాదావి కాని ఖరీదు గలవే! పది జాకెట్లు నాయలవీ, ఖద్దరవీ, సాదావీ-మరి అమ్మితే ఖరీదు రావద్దూ! పెట్టెలో అదిమి అదిమి పెట్టింది.

బారాటి జడను ముందుకులాగి, వెంట్రుకల కొసల్ని అల్లుతో, అద్దంలో ముఖం చూసుకొంటో, ప్రతిబింబంలో ఆనందం ఆవరించిన ముఖం ప్రస్ఫుటమవుతూంటే అనుకొంటూంది అన్నపూర్ణ—

జీవితం క్షణక్షణం ఆనందం, దుఃఖం, అసంతృప్తి - మధ్య మారుతూ వుంటుంది గాబోలు. ఒక అరగంట క్రితం వరకూ తను దుఃఖం, అసంతృప్తి మధ్యన నలిగింది, ఇప్పుడో-ఆనందంలో. పాపం! తలిదండ్రులు ఆలోచించరు. తాము పిల్లని ఎవరికో పిల్ల యిష్టం లేకపోయినా యిస్తే, ఆమె తెల్సుకొని లేచిపోయి వివాహం చేసుకొంటుందని ఆలోచిస్తారు గామోసు, పిల్ల యిష్టా యిష్టాలు కనుక్కోకపోయినా ఫరవాలేదు, మన పిల్ల మనం చెప్పినట్టు వినక ఏం చేస్తుంది అని. ఇప్పుడు యిది చేసింతరువాత ఏమనుకొంటారో, నిందిస్తారో, ద్వేషిస్తారో? లోకం అనుకొంటుంది ఫలానా అమ్మాయి ఫలానా వాడితో లేచిపోయిందని? దాన్ని అవినీతి క్రింద కడతారు-అంతే అదేవాళ్ళకు తెలిసింది; ప్రేమించి, వీలు కాకపోతే, ప్రేమ సాఫల్యం కోసం ఆ రూపం ఆచరించిందని తెల్సుకోరు.

మెల్లగా తలుపును చప్పుడు కాకుండా నెట్టుకొంటూ వస్తున్నాడు, తండ్రి-చూశాడు గదంతా. ఓమూల తోలుపెట్టె నిండా కుక్కి, కొన్ని గుడ్డల చివర్లు బయటికి కనబడుతూవున్నాయ్. తండ్రిని చూసి అదిరిపోయింది అన్నపూర్ణ - పెట్టెవంక చూస్తోంది. ఇంకో అయిదు నిముషాల్లో ఆ పెట్టెను చేత్తో పట్టుకొని, టిస్యూ చీరతో, వంకీల వడ్డాణం, గోవర్థన గొలుసు, నెక్‌లెస్, రెండు ఉంగరాలు, గడియారం, గాజులు, చంద్రహారం, పగడాల గొలుసు మొదలైన నగలతో ఆవరింపబడిన శరీరంతో - ఈ భవనాన్ని, తలిదండ్రుల శరీరాల్ని, నీతినీ, హోదానీ, ధర్మాన్నీ న్యాయాన్నీ వదలి నాగేశ్వరరావుతో కలసి వెళ్ళాలి. తప్పదు! తప్పదు! ఎంతమంది అడ్డొచ్చినా వెళ్ళాలి!

తండ్రి అంటున్నాడు, పాపం - మరిపెంచి పెద్దదాన్ని చేసినవాడాయె.

విడిచి వెళ్ళిపోతావా అన్నపూర్ణా ఇది ధర్మమా? న్యాయమా? నీతా? నీ హోదాకి తగునా? తొమ్మిది నెల్లు మోసి, కని, ఇప్పటిదాకా పెంచిన నీ తల్లిని మరిచి, తండ్రిని మరిచి వెళ్ళిపోతావా? ఎక్కడుంది ఇది కూతురు చేయాల్సిన పని? ఇదివరకు మాటమాత్రం చెప్పకపోయావా. నాగేశ్వరరావుని చేసుకుంటానని? చెబితే నీ మాటకు. ఏకపుత్రివైన నీ మాటకు కాదనేవాళ్ళమా? భయంతో, సిగ్గుతో చెప్పలేకపోతే అందుకు నేను బాధ్యుణ్ణని నామీద అలిగి లేచిపోతే - ఆ అప్రతిష్ట, అవమానం ఎవరికి? ఇంత హోదాకలిగి, ఊళ్లో యింత పేరు సంపాదించుకొంటూన్న నేను బజారుకెళ్ళి తలెత్తగలనా? ఫలానా వాడి కూతురు ఫలానా వారి కొడుకుతో లేచిపోయిందని చెప్పుకొని నవ్వరా? నీవు తలిదండ్రులకు జీవితంలో యివ్వవలసిన బహుమానం ఇదేనా? తలిదండ్రులను దుఃఖంలో ముంచి కుమిలి కృశించేట్టు చేసి వెళ్ళడంలో నీకు యిష్టముంటే వెళ్లు, వెళ్లు! నేను వద్దనను, అడ్డుపెట్టను! నీ ఆనందాన్ని. నీ జీవితం ఆనందంగా గడవటాన్ని నేను ఎప్పుడూ వాంఛిస్తాను.

కళ్ళ నీళ్ళతో—

అన్ని బుద్ధుల్నీ నేర్పి, విద్యలు చెప్పించిన, తల్లిదండ్రులమైన మేము నీకింత చేదేసిపోయామా అన్నపూర్ణా! ఈ ముసలివాళ్ళను అశాంతంలో, దుఃఖంలో ముంచటం, అప్రదిష్టపాలు చేయటం నీకుమాత్రం ఇది కాదా? - నాగేశ్వరరావుకిచ్చి పెళ్ళి చేయటం నా కభ్యంతరం కాదు. ఆ విషయం నాకు ముందుగా చెప్పివుండాల్సింది. కనీసం నాగేశ్వరరావు తలిదండ్రులు అడిగినా బావుండేది, అదేమీ లేకపోయె. ఇప్పుడు, తీరా రేపు రాత్రికి పెళ్ళి-లేచిపోవటం? పెళ్ళికొడుకు తరపువాళ్లు ఏమనుకుంటారు! నేనేమని సమాధానపర్చేది? ఊళ్లో వాళ్ళ పుకార్లని ఎలా అరికట్టేది? వెళతావా అన్నపూర్ణా!—

కూతురు చేతులుపట్టుకు బ్రతిమాలుతున్నాడు తండ్రి, వంశ మర్యాదలను, కీర్తిని నిలబెట్టమని. అటువంటప్పుడు ఆమె ద్రోహం చేస్తుందా?